
మెదక్ చర్చి ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రంగుల రట్నాలు, ఇతర ఆట వస్తువులు

# క్రిస్మస్ సందడి షురూ

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 20: మెదక్ సీఎస్ఐ చర్చిలో మరో నాలుగు రోజుల్లో కొనసాగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చే సందర్శకుల మానసికోల్లాసానికి పలు రకాల దుకాణాలు వెలిశాయి. ఓ పక్క దుకాణ సముదాయాలు, మరోపక్క రంగుల రాట్నాలు, చిన్న పిల్లలు ఇష్టపడే బైక్ రేస్‌లు, చిన్న చిన్న రైళ్లు కనువిందు చేయన్నాయి. ఆకట్టుకొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దుకాణాల్లో పిల్లలను, పెద్దలను ఆకర్షించే విధంగా ఏసయ్య నామరూపాల్లోని కీ చైన్స్, లాకెట్లు, చర్చి ఫొటోల దుకాణాలు ఏర్పడ్డాయి.


చర్చి ఆవరణలో వెలిసిన దుకాణాలు


చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శాంతాక్లాజ్


క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న మెదక్ చర్చి

# ఆటో డ్రైవర్ల బతుకులు అస్తవ్యస్తం

**సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు**

నర్సాపూర్, డిసెంబర్ 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం ఆటో డ్రైవర్ల బతుకులను అస్తవ్యస్తం చేసిందని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సుమారు 100 ఆటోలతో భారీ ర్యాలీ, చౌరస్తాలో ఆటో డ్రైవర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఆటోని నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న ఆటో కార్మికుల బతుకులు ఇబ్బందికరంగా మారాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఆంజనేయులు, నాగభూషణం, రాజు, భిక్షపతి, కుమార్, లక్ష్మణ్ గౌడ్, ఖదీర్, సత్యనారాయణ, నందు, రాములు, మహేశ్, మునీర్, రమణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో ఆటోవాలాల రాస్తారోకోతో రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు


గణిత మేళాను పరిశీలిస్తున్న సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

## రామానుజన్ స్ఫూర్తితో
# ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 20: ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఉన్నత లక్ష్యంతో విద్యాభ్యాసం చేయాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బక్రిచెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గణితం ద్వారా వేగం కచ్చితత్వం అనే లక్ష్యాలను విద్యార్థులు అలవర్చుకొని తమ జీవితంలో విజయాలు అందుకోవాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు
# సర్వం సిద్ధం చేయాలి

- 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- మార్పులు, చేర్పుల దరఖాస్తులను పరిష్కరించాలి
- రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్ జాబితా తయారీతోపాటు ఎన్నికల పకడ్బందీ నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీ, మెదక్ ఆర్డీవో రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ త్వరలోనే పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికలకు ఓటర్ల జాబితా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మార్పులు, చేర్పులు, చిరునామా మారిన వారు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ హరిదీప్ సింగ్, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.


మెదక్ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

# ఏసయ్య పండుగకు ముస్తాబు


- జహీరాబాద్ మార్కెట్‌లో క్రిస్మస్ సందడి
- ప్రారంభమైన ప్రీ క్రిస్మస్ వేడుకలు
- విద్యుత్ దీపాలతో చర్చిలు అలంకరణ


జహీరాబాద్ పట్టణంలో విద్యుత్ దీపాలతో కళ కళ లాడుతున్న మెథడిస్టు చర్చి

జహీరాబాద్, డిసెంబర్ 20: మార్కెట్‌లో క్రిస్మస్ సందడి నెలకొన్నది. క్రిస్మస్ పర్వదినం సమీపిస్తుండతో క్రైస్తవులు సన్నాహాలను ముమ్మరం చేశారు. క్రైస్తవులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించేందుకు చర్చిలు సర్వం సిద్ధం చేస్తున్నారు. క్రిస్మస్ పండగకు ముందు నిర్వహించే ప్రీ క్రిస్మస్ వేడుకలు జోరుగా నిర్వహిస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్టు చర్చితో పాటు నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్నాయి. క్రిస్మస్ వేళ షాపింగ్ మాల్స్ ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. క్రైస్తవులు, సంఘాల ప్రతినిధులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### క్రైస్తవుల ఇంటి ముందు క్రిస్మస్ స్టార్స్..

క్రీస్తు పుట్టుకను సూచించే నక్షత నమూనాలను క్రైస్తవులు పండగకు కొద్ది రోజుల ముందు నుంచే ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్నారు. చర్చిల ముందు క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. దీంతో మార్కెట్లో క్రిస్మస్ ట్రీ, స్టార్స్‌కు భారీగా డిమాండ్ పెరిగింది. బెలూన్స్, అలంకరణ వస్తువులకు వ్యాపారులు ధరలు పెంచారని క్రైస్తవులు తెలిపారు. క్రిస్మస్ పండగకు పది రోజుల ముందు నుంచే క్రైస్తవ సంఘాలు క్యారెల్స్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి 6 నుంచి క్యారెల్స్ బృందం పర్యటిస్తున్నది. భక్తి గీతాలు, వాయిద్యాల హోరుతో క్రైస్తవులు ఇండ్లను సందర్శించి ప్రార్థనలు చేస్తున్నారు.


జహీరాబాద్ ఎంఆర్‌హెచ్‌ఎస్ మైదానంలో ఉన్న మెథడిస్టు చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ పాక

### ప్రజలతో కిటకిటలాడుతున్న షాపింగ్ మాల్స్..

జహీరాబాద్ పట్టణంలో ఉన్న షాపింగ్ మాల్స్ క్రైస్తవులతో కిటకిటలాడుతున్నాయి. క్రిస్మస్ పండుగ కోసం ప్రజలు షాపింగ్, ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. క్రిస్మస్ పండగ కోసం క్రైస్తవులు ఉత్సహంగా కేక్‌లను కట్ చేస్తారు. వ్యాపారులు భారీగా కేక్‌లు తయారు చేసి అమ్మకాలు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. బేకరీ యజమానులు ముందుగానే ఆర్డర్లు తీసుకుని కేక్‌లు తయారు చేసేందుకు అవసరమైన వస్తువులు సిద్ధం చేసుకుంటున్నారు. క్రిస్మస్ పండగ సమీపిస్తుండంతో క్రైస్తవులు చర్చిలకు విద్యుత్ దీపాలు, రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. షాపింగ్ మాల్స్ ముందు క్రిస్మస్ తాతా (సాంబాక్లాజ్) బొమ్మలు భారీస్థాయిలో ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండగ కోసం జహీరాబాద్ పట్టణంలో ఉన్న ప్రధాన చర్చిలు సుందరంగా ముస్తాబు చేగా, విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. చర్చిల ముందు బెలూన్స్, స్టార్స్, క్రిస్మస్ ట్రీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.